663) దేవగాంధారి

ప॥ ఎదుటనే వున్నవి యిన్నియును। యిది కైవసమగు టెన్నడో కాని॥

చ॥ ఆకస మొకటే అలభూ మొకటే। లోకములు పెక్కు లోలోనే।
శ్రీకాంతు డదివో చిత్తములోననె। యేకచిత్త మగు టెన్నడో కాని॥

చ॥ యిరవగు కాలం బెప్పటిసహజమె। అరుదగు దినములు అనంతము।
పరమాత్ముడు లోపల వెలుపల నిదె। యెరవుమాని చేరు టెన్నడో కాని॥

చ॥ భావించగ నొకబ్రహ్మాండంబే। జీవరాసులే సేనలివే।
శ్రీవేంకటేశుడు సృష్టించినవాడు। యీవిధి గని మను టెన్నడో కాని॥